క్లుప్తంగా

నేడు వట్టిచెరుకూరులో ఎమ్మెల్యే సుచరిత పర్యటన

వట్టిచెరుకూరు (ప్రత్తిపాడు): మండల కేంద్రం వట్టిచెరుకూరులోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శుక్రవారం జరగనున్న జగనన్న అమ్మ ఒడి నగదు పంపిణీ కార్యక్రమంలో స్థానిక ఎమ్మెల్యే మేకతోటి సుచరిత పాల్గొననున్నట్లు ఎంపీడీవో జి. శేషగిరిరావు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రజాప్రతినిధులు, అన్ని శాఖల అధికారులు హాజరు కావాలని ఆయన కోరారు.

ఉపాధిహామీ ఇన్‌చార్జి ఏపీవోగా మస్తాన్‌వలి



ప్రత్తిపాడు: మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధిహామీ పథకం ఇన్‌చార్జి ఏపీవోగా షేక్ మస్తాన్‌వలి గురువారం బాధ్యతలు స్వీకరించారు. ఇప్పటి వరకు ఇక్కడ ఇన్‌చార్జిగా చేస్తున్న జ్యోతిని ఆ శాఖ ఉన్నతాధికారులు పెదనందిపాడు మండలానికి బదిలీ చేశారు. ఆమె స్థానంలో అక్కడ విధులను నిర్వర్తిస్తున్న మస్తాన్‌వలిని ప్రత్తిపాడుకు బదిలీ చేయడంతో ఆయన బాధ్యతలు చేపట్టారు. అన్ని గ్రామ పంచాయతీల్లో ఉపాధి పనులు జరిగేలా చూస్తానని మస్తాన్‌వలి తెలిపారు.

గుండె పోటుతో ఉపాధి హామీ కూలీ మృతి

లింగంగుంటపాలెం(కాకుమాను): గుండె పోటుతో ఉపాధిహామీ కూలీ మృతి చెందిన ఘటన లింగం గుంటపాలెం గ్రామంలో గురువారం ఉదయం చోటుచేసుకుంది. తోటి కూలీలు, సిబ్బంది తెలిపిన వివరాల మేరకు.. గ్రామానికి చెందిన షేక్ మస్తాన్ వలీ(68) గురువారం ఉపాధి పనులకు వెళ్లాడు. పది నిమిషాల్లో పనులు ముగిసే సమయానికి మస్తాన్‌వలీ ఒక్కసారిగి కుప్పకూలిపోయాడు. ఆయనను గ్రామంలోని ఆర్‌ఎంపీ వద్దకు తీసుకువెళ్లి పరీక్షించగా.. అప్పటికే మృతి చెందినట్లు తెలిపారు. జెడ్పీటీసీ ముజావర్ షేక్ గుల్జార్ బేగం మస్తాన్‌వలీ మృతదేహానికి నివాళులర్పించారు.

ఆయాసం బాధ తాళలేక..



మృతి చెందిన రామకోటయ్య

పెదగొట్టిపాడు (ప్రత్తిపాడు): ఆయాసం బాధ తాళలేక ఓ వృద్ధుడు పురుగుమందు తాగి ఆత్మహత్యకు పాల్పడిన ఘటన మండలంలో చోటుచేసుకుంది. పోలీసుల వివరాల మేరకు.. పెదగొట్టిపాడు గ్రామానికి చెందిన మార్రెళ్ల రామకోటయ్య (70) కొన్ని సంవత్సరాలుగా ఆయాసంతో బాధపడుతూ ఇంటి వద్దనే ఉంటున్నాడు. రోజురోజుకీ వయస్సు కూడా మీదపడుతుండటంతో మందుల ప్రభావం కూడా అంతగా పనిచేయడం లేదు. దీంతో ఆయాసం బాగా ఎక్కువయ్యింది. ఈ నేపథ్యంలో బుధవారం రాత్రి గడ్డిమందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. గమనించిన కుటుంబ సభ్యులు గుంటూరు జీజీహెచ్‌కు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ రాత్రి మరణించాడు. ఈ మేరకు గురువారం మృతుని భార్య మార్రెళ్ల సత్యవతి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ డి. రవీంద్రబాబు తెలిపారు.

పత్తి డబ్బుల ఎగవేతపై కేసు

పట్నంబజారు: పత్తి కొనుగోలు చేసి డబ్బులు ఇవ్వకుండా ఇబ్బందులకు గురి చేస్తున్న నలుగురిపై కేసు నమోదైంది. లాలాపేట పోలీసు స్టేషన్ సీఐ ఎం.సుబ్బారావు తెలిపిన వివరాల ప్రకారం.. ఏటుకూరు రోడ్డులో నివాసం ఉండే హరికృష్ణ యడ్లపాడుకు చెందిన నలుగురు పార్టనర్లు ఉన్న స్పిన్నింగ్ మిల్లుకు రూ. 9.50 లక్షల విలువ చేసే పత్తిని విక్రయించారు. దీనికి సంబంధించిన నగదు ఇవ్వకపోవడంతో పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు. జిల్లా వ్యాప్తంగా మరికొంత మందికి నగదు ఇవ్వలేదని తెలిసిందని చెప్పారు.

ఆర్టీసీ అభివృద్ధికి కృషి



తెనాలి అర్బన్: తెనాలి ఆర్టీసీ డిపో అభివృద్ధికి ఉద్యోగులంతా కృషి చేయాలని జిల్లా ప్రజా రవాణా అధికారి ఎం.రవికాంత్ సూచించారు. తెనాలి డిపోను గురువారం ఆయన పరిశీలించారు. అనంతరం ఉద్యోగులతో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. జిల్లా పరిధిలో ఐదు డిపోలు న్నాయని చెప్పారు. ప్రజారవాణా అధికారిగా బాధ్యతలు స్వీకరించిన తరువాత మొట్టమొదటి సారిగా తెనాలి వచ్చినట్లు తెలిపారు. ప్రయాణికులకు అసౌకర్యం కలగకుండా పలు చర్యలు తీసుకుంటున్నట్లు చెప్పారు. రెండు నెలలకు ఒకసారి డయల్ యువర్ ఆర్‌ఎం, నెలకు ఒకసారి డయల్ యువర్ డీఎం కార్యక్రమాల్ని క్రమంతప్పకుండా నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. అరుణాచలం గిరి ప్రదర్శన సర్వీసులకు ఆదరణ ఉందని, దాన్ని కొనసాగించనున్నట్లు చెప్పారు. గుంటూరు-తెనాలి నాన్‌స్టాప్‌ల స్థానంలో సింగిల్ స్టాప్ అల్ట్రా పల్లె వెలుగు బస్సుల ఏర్పాటుకు ఉన్నతాధికారులకు ప్రతిపాదనలు పంపినట్లు వెల్లడించారు. అనుమతులు రాగానే సర్వీసులు ప్రారంభిస్తామన్నారు. తెనాలిలో బస్సు బయలుదేరితే నారాకోడూరులో స్టాప్ ఉంటుందని, అక్కడి నుంచి నేరుగా గుంటూరు వెళ్తుందని చెప్పారు.

ప్రజా సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం

జగనన్న సురక్ష శిబిరంలో జెడ్పీ చైర్‌పర్సన్ కత్తెర హెనీ క్రిస్టినా



వట్టిచెరుకూరులో జరిగిన జగనన్న సురక్ష శిబిరంలో రైతులకు యూరియా బస్తాలు అందజేస్తున్న జెడ్పీ చైర్‌పర్సన్ కత్తెర హెనీ క్రిస్టినా, జెడ్పీటీసీ సభ్యురాలు వెంకటలక్ష్మి

వట్టిచెరుకూరు (ప్రత్తిపాడు): ప్రజా సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయమని జెడ్పీ చైర్‌పర్సన్ కత్తెర హెనీ క్రిస్టినా అన్నారు. మండల పరిధిలోని వట్టిచెరుకూరులో జరిగిన జగనన్న సురక్ష కార్యక్రమంలో ఆమె ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. వివిధ ధృవీకరణ పత్రాలకు దరఖాస్తు చేస్తున్న లబ్ధిదారులకు ఉచితంగా సర్టిఫికెట్లు అందజేశారు. అనంతరం వ్యవసాయశాఖ ఆధ్వర్యంలో ఆర్‌బీకేల ద్వారా సరఫరా చేస్తున్న యూరియా కట్టలను క్రిస్టినా రైతులకు అందించారు. ఈ సందర్భంగా క్రిస్టినా మాట్లాడుతూ గతంలో ఏ ప్రభుత్వాలు చెయ్యలేని విధంగా సంక్షేమ పాలనను ఇంటింటికీ చేరుస్తున్న నేత ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి అని పేర్కొన్నారు. రాష్ట్ర ప్రభుత్వం అనేక పథకాలు అమలు చేస్తున్నప్పటికీ, ఇంకా ఎక్కడైనా గ్రామాల్లో అర్హత ఉండీ పథకాలు పొందలేని వారికి కూడా పథకాలు అందించడమే లక్ష్యంగా జగనన్న సురక్ష కార్యక్రమానికి సీఎం జగన్ రూపకల్పన చేశారన్నారు. జెడ్పీటీసీ భీమినేని వెంకటలక్ష్మి, ఎంపీడీవో జి. శేషగిరిరావు, సచివాలయాల మండల కన్వీనర్ నాదెండ్ల రామచంద్రయ్య తదితరులు పాల్గొన్నారు.

జగనన్న సురక్షను సద్వినియోగం చేసుకోవాలి

జగనన్న సురక్షను ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని డ్వామా పీడీ యుగంధర్ అన్నారు. వట్టిచెరుకూరు మండల పరిధిలోని గారపాడులో జగనన్న సురక్ష క్యాంపు నిర్వహించారు. తొలుత బాబూ జగజ్జీవన్‌రామ్ వర్ధంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి పీడీ నివాళులర్పించారు. అనంతరం ముందుగా టోకెన్లు మంజూరు చేసిన లబ్ధిదారులకు సర్వీసు చార్జీ లేకుండా సర్టిఫికెట్లు అందించారు. ఈ సందర్భంగా పీడీ మాట్లాడుతూ ప్రభుత్వం ప్రతి ఇంటికీ సంక్షేమం అందాలన్న ఉద్దేశ్యంతోనే కార్యక్రమాన్ని చేపడుతుందన్నారు. కార్యక్రమంలో ఆయా శాఖల అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

విద్యావ్యవస్థలో విప్లవాత్మక మార్పులు

వట్టిచెరుకూరు (ప్రత్తిపాడు): రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి విద్యా వ్యవస్థను బలోపేతం చేసేందుకు విప్లవాత్మక మార్పులు తీసుకువస్తున్నారని జెడ్పీ చైర్‌పర్సన్ కత్తెర హెనీ క్రిస్టినా అన్నారు. వట్టిచెరుకూరులోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను మధ్యాహ్నం ఆమె పరిశీలించారు. తొలుత బాబూ జగ్జీవన్‌రామ్ వర్ధంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం పాఠశాలలోని తరగతి గదులు, వసతులను పరిశీలించారు. హాస్టల్‌లో ఉండి ప్రభుత్వ పాఠశాలలో చదువుతున్న విద్యార్థులకు అవసరమైన ట్రంకు పెట్టెలు, భోజనం ప్లేట్లు, గ్లాసులను అందజేశారు. అదే పాఠశాలలో పని చేస్తూ బదిలీపై వెళ్లిన పలువురు ఉపాధ్యాయులను క్రిస్టినా దుశ్శాలువా, పూలమాలలతో ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా క్రిస్టినా మాట్లాడుతూ విద్యాభివృద్ధి కోసం ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలను సద్వినియోగం చేసుకుని చదువులో రాణించాలన్నారు. వెంట జెడ్పీటీసీ సభ్యురాలు వెంకటలక్ష్మి, హెచ్‌ఎం రమాదేవి తదితరులున్నారు.

ప్రతి ఒక్కరి సమస్యకు 'జగనన్న సురక్ష'లో పరిష్కారం



జగనన్న సురక్ష కార్యక్రమంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే సుచరిత, వేదికపై ఎంపీపీ అన్నమ్మ

- 'గడప గడపకు మన ప్రభుత్వం' పూర్తవ్వగానే గ్రామానికి నిధులు కేటాయిస్తా
- ప్రత్తిపాడు శాసన సభ్యురాలు మేకతోటి సుచరిత

కోయవారిపాలెం (ప్రత్తిపాడు): ప్రతి ఒక్కరి సమస్యను వినడంతో పాటు వాటిని పరిష్కరించడమే లక్ష్యంగా రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి జగనన్న సురక్ష కార్యక్రమాన్ని ప్రజల ముంగిటకు తీసుకువచ్చారని ఎమ్మెల్యే మేకతోటి సుచరిత అన్నారు. మండల పరిధిలోని కోయవారిపాలెంలో గురువారం జగనన్న సురక్ష క్యాంప్ నిర్వహించారు. ఎమ్మెల్యే సుచరిత క్యాంప్‌లో పాల్గొన్నారు. లబ్ధిదారులకు ధృవీకరణ పత్రాలను అందించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ క్యాంపుల్లో తొమ్మిది రకాల ధృవీకరణ పత్రాలను ప్రభుత్వం ఎలాంటి సర్వీసు చార్జీలు లేకుండా అందిస్తుందని చెప్పారు. ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. వైఎస్సార్ కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత పాలనలో ఎన్నో విప్లవాత్మక మార్పులు వచ్చాయన్నారు. వలంటీర్ల వ్యవస్థ, సచివాలయాలు, రైతు భరోసా కేంద్రాలు, హెల్త్ వెల్‌నెస్ సెంటర్లు, ఫ్యామిలీ ఫిజీషియన్ ఇలా అనేక కార్యక్రమాల ద్వారా పాలనను ప్రజలకు చేరువ చేసిన ఘనత వైఎస్ జగన్‌మోహన్ రెడ్డికే దక్కుతుందన్నారు. తాజాగా సచివాలయంలోనే మండలంలోని ప్రభుత్వ యంత్రాంగమంతా రోజంతా ఉండేలా జగనన్న సురక్ష వంటి కార్యక్రమానికి రూపకల్పన చేశారని వివరించారు. ప్రజాభివృద్ధికి అనునిత్యం పాటుపడుతున్న వైఎస్సార్ కాంగ్రెస్ ప్రభుత్వాన్ని ప్రతి కుటుంబం ఆశీర్వదించాలని కోరారు. ఈ సచివాలయం పరిధిలో మరొక్క రోజు గడపగడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించాల్సి ఉందని, పూర్తయిన వెంటనే గ్రామాభివృద్ధికి నిధులు కేటాయిస్తామని సుచరిత స్పష్టం చేశారు.

సర్పంచ్ చులకనగా మాట్లాడుతున్నారు..

దళితవాడలో నీటి సమస్యను, మురుగు సమస్యను పరిష్కరించాలని అడిగినందుకు పనులు చెయ్యక పోగా సర్పంచ్ చులకనగా మాట్లాడుతున్నారని గ్రామానికి చెందిన తొమ్మిదవ వార్డు సభ్యురాలు నూకాబత్తిని అనూరాధ ఎమ్మెల్యే వద్ద వాపోయారు. వార్డు మెంబరునే ఇలా మాట్లాడుతంటే ఏమి చేయాలో పాలుపోక మీకు చెబుతున్నానని చెప్పారు. స్పందించిన ఎమ్మెల్యే సెక్రటరీని మందలించారు. తాగునీరు, పారిశుద్ధ్య వంటి సమస్యలను వెంటనే పరిష్కరించాలని ఆదేశించారు. అదేవిధంగా గ్రామంలోని ఎస్టీలు తాగునీటి సమస్యను పరిష్కరించాలని సుచరితను కోరారు. వెంటనే ఆమె ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ, పంచాయతీ కార్యదర్శులతో మాట్లాడారు. జలజీవన్ మిషన్ నిధులున్నా ఎందుకు పనులు చేయడం లేదని, వెంటనే అంచనాలు తయారు చేసి పనులు ప్రారంభించాలని ఆదేశించారు. సమావేశంలో ఎంపీపీ దాసరి అన్నమ్మ, కోయవారిపాలెం సర్పంచ్ మల్లేశ్వరరావు, కొండేపాడు సర్పంచ్ నర్రా రాంబాబు, ఎంపీటీసీ మధు, ఎంపీడీవో శ్రీరమ్య, తహసీల్దార్ సిద్ధార్థ, సచివాలయాల మండల కన్వీనర్ వేలూరి లక్ష్మారెడ్డి, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

రేషన్ బియ్యం అక్రమ నిల్వలపై పోలీసుల దాడులు



నిల్వ ఉంచిన రేషన్ బియ్యాన్ని పట్టుకున్న ఎస్‌ఐ అబ్దుల్ రెహమాన్

పెదనందిపాడు: అక్రమంగా నిల్వ ఉంచిన రేషన్ బియ్యాన్ని స్వాధీనం చేసుకున్నట్లు ఎస్‌ఐ అబ్దుల్ రెహమాన్ తెలిపారు. గురువారం పెదనందిపాడు ఎస్‌ఐ వివరాల మేరకు.. మండల పరిధిలోని వరగాని గ్రామంలో ఊరి చివరన ఉన్న ఇంటిలో గుట్టుచప్పుడు కాకుండా రేషన్ బియ్యాన్ని నిల్వ చేశారన్న సమాచారంతో ఎస్‌ఐ తన సిబ్బందితో దాడి చేశారు. 29 గోతాల్లో నిల్వ ఉంచిన 7.5 క్వింటాళ్ల బియ్యాన్ని సీజ్ చేసి, పోలీసుస్టేషన్‌కు తరలించారు. బియ్యం నిల్వ చేసిన డి.కోటయ్య ను అదుపులోకి తీసుకున్నట్లు తెలిపారు.

15 క్వింటాళ్లు..

ప్రత్తిపాడు: అక్రమంగా నిల్వ చేసిన రేషన్ బియ్యాన్ని ప్రత్తిపాడు పోలీసులు స్వాధీనం చేసుకున్నారు.వివరాల మేరకు.. ప్రత్తిపాడు జెట్టిమిట్ట బజారులోని దూపాటి సుబ్బారావు ఇంట్లో అక్రమంగా రేషన్ బియ్యం నిల్వ చేశారన్న సమాచారం బుధవారం రాత్రి ఎస్‌ఐ డి.రవీంద్రబాబుకు అందింది. దీంతో ఆయన సిబ్బందితో కలిసి ఇంటిపై దాడి చేశారు. ఇంట్లోని ఓ గదిలో 44 తెల్లబస్తాల్లో నిల్వ చేసిన 1500 కేజీల రేషన్ బియ్యం గుర్తించి, సీజ్ చేశారు. బియ్యాన్ని అక్రమంగా నిల్వ చేసిన ప్రత్తిపాడు గ్రామస్తుడు వసువర్తి ఏసయ్యను అదుపులోనికి తీసుకున్నారు. ఈ మేరకు అతనిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ రవీంద్రబాబు తెలిపారు.

వైద్యశాలను సందర్శించిన ఏపీ సాక్స్ బృందం

తెనాలి అర్బన్: తెనాలి జిల్లా వైద్యశాలను ఏపీ సాక్స్ సీడీసీ, వీహెచ్‌ఎస్ బృందం గురువారం పరిశీలించింది. హెచ్‌ఐవీ కార్యక్రమాల్ని మెరుగుపరిచే విషయాలపై వైద్యశాల సూపరింటెండెంట్ డాక్టర్ సౌభాగ్యవాణితో చర్చించారు. ఓపీడీలో హెచ్‌ఐవీ పరీక్షలు చేయడానికి ఉన్న అంశాలపై మాట్లాడారు. బృందం సభ్యుల్లో డాక్టర్ రాజేంద్ర ప్రసాద్, డాక్టర్ తరుణ్, డాక్టర్ విజయరామన్, పి.వెంకట్, రాష్ట్ర ప్రోగ్రాం మేనేజర్ డాక్టర్ చంద్ర శేఖరన్, జ్యోతుల వీరాస్వామి ఉన్నారు.

ట్రాఫిక్ నిబంధనలు పాటించడం తప్పనిసరి



పట్నంబజారు: ప్రతి ఒక్కరూ ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని ఆ విభాగ డీఎస్పీ ఎం.బాలసుందరరావు చెప్పారు. నగరంలోని భాష్యం పాఠశాల వద్ద గురువారం సాయంత్రం విద్యార్థులకు ట్రాఫిక్ వెస్ట్ సీఐ అక్కేశ్వరరావు నేతృత్వంలో అవగాహన సదస్సు నిర్వహించారు. ట్రాఫిక్‌కు సంబంధించి తీసుకోవాల్సిన చర్యలపై పోస్టర్లు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా డీఎస్పీ బాలసుందరరావు మాట్లాడుతూ విద్యార్థి దశ నుంచే ట్రాఫిక్ సమస్యలపై అవగాహన కలిగి ఉండాలని సూచించారు.కార్యక్రమంలో సీఐ అక్కేశ్వరరావు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఆస్పత్రి వ్యర్థాలను డంప్ చేసే వారిపై చర్యలు

- సంబంధిత ఆస్పత్రులకు గ్రామ పంచాయతీ నోటీసులు
- సేఫ్ ఎన్విరాన్ వెహికల్ ద్వారా వ్యర్థాల తరలింపు

సాక్షి ఎఫెక్ట్

ప్రత్తిపాడు: ఆస్పత్రుల నుంచి వెలువడే బయో వ్యర్థాలను రోడ్ల వెంబడి డంప్ చేసే ప్రైవేట్ ఆస్పత్రుల యాజమాన్యాలపై కఠిన చర్యలు తీసుకోవడం జరగుతుందని పొల్యూషన్ కంట్రోల్ బోర్డు అనలిస్ట్ వి.వెంకటేశ్వరరావు తెలిపారు. మండల పరిధిలోని ప్రైవేట్ ఆస్పత్రులు బయో వ్యర్థాలను రోడ్ల వెంబడి పడేస్తున్నారని, ఈదుల పాలెం డంపింగ్ యార్డుకు వెళ్లేదారిలో గుట్టలుగుట్టలుగా బయో వ్యర్థాల కవర్లు పడేసి వెళుతున్నారంటూ గురువారం 'సాక్షి'లో ప్రచురితమైన 'వ్యర్థాలతో అనర్థం' కథనంపై పొల్యూషన్ కంట్రోల్ బోర్డు అధికారులు స్పందించారు. జిల్లా ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు ఈదులపాలెంలో డంప్ చేస్తున్న వ్యర్థాల గుట్టలను పొల్యూషన్ కంట్రోల్ బోర్డు అనలిస్ట్ వి.వెంకటేశ్వరరావు, ఫీల్డ్ అసిస్టెంట్ రమేష్ స్థానిక పంచాయతీ అధికారులతో కలిసి పరిశీలించారు. సేఫ్ ఎన్విరాన్ వాహనం ద్వారా బయోవ్యర్థాలను ఎరుపు, పసుపు, నలుపు కవర్లలో సేకరించి బయటకు తరలించారు. ముందు జాగ్రత్తగా బ్లీచింగ్ చల్లించి పరిసరాలను పరిశుభ్రం చేశారు. అదేవిధంగా ఇక్కడ వ్యర్థాలు పడేస్తున్న ఆస్పత్రులను గుర్తించి వాటికి పొల్యూషన్ కంట్రోల్ బోర్డు ఉండి నోటీసులు జారీ చేస్తామని చెప్పారు. సైన్ బోర్డులు ఏర్పాటు చేయాలని పంచాయతీ కార్యదర్శి ఖాజాకు సూచించారు. అనంతరం ఈవోపీఆర్డీ ఆదేశాల మేరకు పంచాయతీ కార్యదర్శి ఖాజా ఓ ప్రైవేట్ ఆస్పత్రి యాజమాన్యమే ఇక్కడ వ్యర్థాలను పడేస్తుందని నిర్ధారించి, వారికి నోటీసులు జారీ చేశారు.

గడప గడపలో జగనన్న సంక్షేమ పథకాల ముద్ర



సంక్షేమ పథకాల లబ్ధిని మహిళకు వివరిస్తున్న ఎమ్మెల్యే కిలారి వెంకట రోశయ్య



నంబూరులో వృద్ధురాలికి సంక్షేమ పథకాల లబ్ధిని వివరిస్తున్న ఎమ్మెల్యే కిలారి

- ఎమ్మెల్యే కిలారి వెంకట రోశయ్య
- నంబూరు లో 'గడప గడపకు మన ప్రభుత్వం'

పెదకాకాని: ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు ద్వారా ప్రజలు ఆర్థికంగా అభివృద్ధి సాధిస్తున్నారని ఎమ్మెల్యే కిలారి వెంకట రోశయ్య అన్నారు. నంబూరు గ్రామంలో చేపట్టిన గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం గురువారం రెండో రోజుకు చేరింది. గ్రామంలోని ముస్లిం కాలనీ, జై భారతరెడ్డి నగర్‌లో ఇంటింటికి తిరిగి సంక్షేమ పథకాలు ద్వారా ఆయా కుటుంబాలకు చేకూరిన లబ్ధిని వివరించి, బ్రోచర్ అందజేశారు. ఎమ్మెల్యే కిలారి వెంకట రోశయ్య మాట్లాడుతూ ప్రభుత్వం విద్య, వైద్యం, వ్యవసాయ రంగాలకు అధిక ప్రాధాన్యం ఇస్తోందన్నారు. గత టీడీపీ ప్రభుత్వం ప్రభుత్వ పాఠశాలలను నిర్వీర్యం చేసిందని కార్పొరేట్ సంస్థలకు దారాదత్తం చేసిందని ఆరోపించారు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వం వచ్చిన తర్వాత రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డి శిథిలావస్థలో ఉన్న పాఠశాలలను మనబడి నాడు-నేడు పథకంతో కార్పొరేట్ విద్యా సంస్థలకు దీటుగా తీర్చిదిద్దారన్నారు. ఈ సందర్భంగా భారత మాజీ ఉప ప్రధాని డాక్టర్ బాబు జగ్జీవన్‌రామ్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ తుల్లిమిల్లి శ్రీనివాసరావు, జెడ్పీ సభ్యురాలు గోళ్ళ జ్యోతి, గ్రామ సర్పంచ్ నంబూరు జ్యోతి, ఎంపీడీవో బీవీ మల్లేశ్వరరావు, పెదకాకాని సర్పంచ్ గోళ్ళ స్వరూప రాణి, ఎంఎస్‌ఎంఈ డైరెక్టర్ భీమవరపు విజయలక్ష్మి, జేసీఎస్ కన్వీనర్ చాగంటి మురళీమోహన్ రెడ్డి, స్థానిక నాయకులు ఉయ్యూరు సతీష్ రెడ్డి, భీమవరపు కష్టారెడ్డి, భీమవరపు కోటిరెడ్డి, జొన్నల అవినాష్‌రెడ్డి, సయ్యద్ సుభాని, షేక్ దండి బాబు, మందాల శివారెడ్డి, జొన్నల శేసిరెడ్డి, జొన్నల కరుణాకర్ రెడ్డి పాల్గొన్నారు.

ప్రజా సమస్యల పరిష్కారానికి గడప గడపకు

ప్రభుత్వం పార్టీలకు అతీతంగా సంక్షేమ పథకాలు అమలు చేస్తోందని ఎమ్మెల్యే కిలారి వెంకటరోశయ్య అన్నారు. నంబూరులో బుధవారం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం జరిగింది. గ్రామంలో ఇంటింటికీ తిరిగి ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను వివరిస్తూ బుక్‌లెట్‌ను ఎమ్మెల్యే అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. రాష్ట్రంలో ప్రజా సంక్షేమమే లక్ష్యంగా పరిపాలన సాగుతోందన్నారు. ప్రజా సంకల్పయాత్రలో ప్రజల సమస్యలు స్వయంగా తెలుసుకుని సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మేనిఫెస్టో ప్రకటించడం జరిగిందన్నారు. నంబూరులో ఎమ్మెల్యే కిలారి వెంకటరోశయ్యకు అడుగడుగునా ప్రజలు హారతులు పట్టి..స్వాగతం పలికారు.

విజ్ఞాన్ వర్శిటీ అసిస్టెంట్ ప్రొఫెసర్‌కు డాక్టరేట్ ప్రదానం



ప్రొఫెసర్ శ్రీరంగనాథ్‌ను అభినందిస్తున్న వర్శిటీ చైర్మన్ లావు రత్తయ్య

చేబ్రోలు: వడ్లమూడిలోని విజ్ఞాన్ యూనివర్శిటీ అసిస్టెంట్ ప్రొఫెసర్ ఉత్పల శ్రీరంగనాథ్‌కు డాక్టరేట్ ప్రదానం చేసినట్లు వైస్ చాన్సలర్ పి.నాగభూషణ్ గురువారం తెలిపారు. ఉమెన్ అండ్ నేచర్ : ఏ స్టడీ ఆఫ్ ద కాన్సెప్ట్ ఆఫ్ ఎకోఫెమినిజం ఇన్ ద సెలెక్ట్ నోవల్స్ ఆఫ్ కమల మార్కండయ' అనే అంశంపై శ్రీరంగనాథ్ పరిశోధన చేశారని తెలియజేశారు. ఈయన పరిశోధనలో భాగంగా మొత్తం 2 స్కూపస్, 2 ఇంటర్నేషనల్ జర్నల్ రీసెర్చ్ పబ్లికేషన్స్ పబ్లిష్ చేశారని తెలిపారు. విజ్ఞాన వర్శిటీ నుంచి పీహెచ్‌డీ పట్టా పొందిన ఉత్పల శ్రీరంగనాథ్‌ను చైర్మన్ లావు రత్తయ్య అభినందించారు.

పాతరెడ్డిపాలెంలో క్షుద్రపూజల కలకలం

పోలీసులకు ఫిర్యాదు చేసిన స్థానికులు



పాతరెడ్డిపాలెం క్షుద్ర పూజలు చేసినట్లుగా ఉన్న ఆనవాళ్లు

చేబ్రోలు: కొద్ది రోజులుగా పాతరెడ్డిపాలెం గ్రామంలో క్షుద్ర పూజలు చేస్తుండటం స్థానికంగా కలకలం సృష్టించింది. గ్రామ పరిధిలోని ముట్లూరు రోడ్డులో కోటుపల్లి శివనాగేశ్వరావు ఇంటి సమీపంలో గుర్తుతెలియని వ్యక్తులు క్షుద్ర పూజలు చేసినట్లు ఆనవాళ్లను గుర్తించి, గురువారం పోలీసులకు ఫిర్యాదు చేశాడు. వారం రోజులుగా గుర్తుతెలియని వ్యక్తులు నాగిశెట్టి రామయ్య, వినాయకుడిగుడి, రామాలయం, వివిధ రహదారి కూడలి ప్రాంతాల్లో భయభ్రాంతులకు గురిచేసే విధంగా పూజల ఆనవాళ్లు.. స్థానికులు ఆందోళన చెందుతున్నారు. ఇళ్ల ముందు నిమ్మకాయలు, కోడిగుడ్లు, పసుపు, కుంకమ, మిరపకాయలు, నలుపుదారం, జుట్టు, పసుపు, కుంకుమతో కూడిన నిమ్మకాయ ముక్కలతో పూజలు చేసిన ఆనవాళ్లు కనిపిస్తుండటం సంచలనం స్థానికుల్లో భయం కలిగిస్తోంది. ఈ ఘటనలపై వారం క్రితం పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేసినప్పటికి స్పందించలేదని స్థానికులు చెబుతున్నారు. భయభ్రాంతులకు గురిచేస్తున్న వ్యక్తులపై కఠిన చర్యలు తీసుకోవాలని పాతరెడ్డిపాలెం గ్రామస్తులు కోరుతున్నారు.

సమస్యల పరిష్కారానికే 'జగనన్న సురక్ష'



పెదనందిపాడు: మహిళకు సర్టిఫికెట్ అందిస్తున్న ప్రత్యేకాధికారి మనోరంజని



గుంటూరు రూరల్: సర్టిఫికెట్ అందజేస్తున్న జెడ్పీటీసీ సుబ్బారావు, ఎంపీపీ దివ్య



కాకుమాను: సర్టిఫికెట్ అందజేస్తున్న జెడ్పీటీసీ, అధికారులు

చేబ్రోలు: క్షేత్రస్థాయిలో సమస్యల పరిష్కారం కోసమే జగనన్న సురక్షా కార్యక్రమాన్ని చేపట్టినట్లు పొన్నూరు నియోజకవర్గ స్పెషల్ ఆఫీసర్ డి.వందనం అన్నారు. చేబ్రోలు-3, చేబ్రోలు-4 గ్రామ సచివాలయాల పరిధిలో గురువారం జగనన్న సురక్షా కార్యక్రమాలు జరిగాయి. చేబ్రోలు-3 సచివాలయం పరిధిలో హౌస్ హోల్డ్ సర్వే ద్వారా గుర్తించిన 216మందికి, చేబ్రోలు-4 సచివాలయం పరిధిలో 226 మందికి వివిధ రకాల ధృవీకరణ పత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా స్థానికులు ఉపాధి హామీ పథకం పనులు చూపటం లేదని, ఏడాదిగా కొంతమందికి ఖాతాల్లో నడదు పడలేదని అధికారుల దృష్టికి తీసుకువచ్చారు. సమస్యను ఉపాధిహామీ సిబ్బందిని పిలిచి పరిష్కరించారు. తహసీల్దారు కేవీ గోపాలకృష్ణ, మండల స్పెషల్ ఆఫీసర్ పల్లవి, ఎంపీడీవో బాబురావు, గ్రామ సర్పంచ్ పి.వినీతారాణి, పీఎస్ ఎం.శ్రీనివాసరావు, ఏపీఎం నాగేశ్వరరావు ప్రజా ప్రతినిధులు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

జగనన్న సురక్ష.. ప్రజలకు రక్ష

గుంటూరు రూరల్: జగనన్న సురక్ష కార్యక్రమం రాష్ట్ర ప్రజలకు రక్ష అని.. జెడ్పీటీసీ తుమ్మల సుబ్బారావు, ఎంపీపీ పులగం దివ్య అన్నారు. గురువారం జొన్నలగడ్డ గ్రామంలో జగనన్న సురక్ష కార్యక్రమాన్ని ఎంపీడీవో శోభరాణి ఆధ్యక్షతన నిర్వహించారు. ఎంపీడీవో మాట్లాడుతూ 418 మంది ప్రజలకు 361 రకాల సేవలను అందించటం జరిగిందన్నారు. అందులో 136 కుల ధృవీకరణ, 159 ఆదాయ ధృవీకరణ పత్రాలు, 18 మందికి ఆధార్ సేవలు, 40 కౌలు రైతు కార్డులు, విత్తనాలు, తదితర సేవలను అందించటం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ మబ్బు శిరీష, ప్రత్యేక అధికారి వజ్రశ్రీ, ఎంపీటీసీ భూలక్ష్మి, సచివాలయాల కన్వీనర్ ఎదురుపాక వెంకట్, మండల వ్యవసాయ శాఖ అధికారి ఐ.సుబ్రమణ్యం, పంచాయితీరాజ్ ఏఈ రమేష్, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

'జగనన్న సురక్ష'తో ప్రజలకు మేలు..

పెదనందిపాడు: నాగులపాడు, అన్నపర్రు గ్రామాల్లో గురువారం జరిగిన జగనన్న సురక్ష కార్యక్రమాల్లో ముఖ్య అతిథిగా పాల్గొన్న ఐసీడీఎస్ ప్రాజెక్టు డైరెక్టర్, మండల ప్రత్యేక అధికారి మనోరంజని పాల్గొన్నారు. అన్నపర్రు గ్రామంలో 363 మందికి, నాగులపాడు గ్రామంలో 518 మందికి సర్టిఫికెట్‌లు అందజేశారు. ఈ కార్యక్రమంలో తహసీల్దారు సుభాని, ఎంపీడీవో రాజగోపాల్, ఏఓ సుధారాణి, ఈవోపీఆర్డీ సాయిలీల, సర్పంచ్‌లు పి.శ్రీలక్ష్మీ, ఎ శ్రీనివాసరావు, సచివాలయ సిబ్బంది, వలంటీర్లు పాల్గొన్నారు.

పేదలకు వరం జగనన్న సురక్ష

వల్లూరు(కాకుమాను): వల్లూరు గ్రామ సచివాలయంలో గురువారం జగనన్న సురక్ష శిబిరం నిర్వహించారు. జెడ్పీటీసీ ముజావర్ షేక్ గుల్జార్ బేగం కార్యక్రమంలో పాల్గొని, సర్టిఫికెట్లను అర్జీదారులకు అందజేశారు. మండల ప్రత్యేకాధికారిణి ప్రేమ కుమారి, సర్పంచ్‌ల సంఘం మండలాధ్యక్షుడు వింతా రాఘవరెడ్డి, మండల ఉపాధ్యక్షుడు తియ్యగూర వెంకటరెడ్డి, వివిధ గ్రామాల సర్పంచ్‌లు విప్పడపు నాంబాబు, చంద్రశేఖరరెడ్డి, షేక్ సైదా, తహసీల్దార్ జె.ప్రసాదరావు, ఎంపీడీఓ రామకృష్ణ, ఏఓ కె.కిరణ్మయి, వివిధ శాఖల అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.